# కంచికి వెళ్ళని కథ

సత్యభామ నా పాత్ర. నన్ను చాలా యిబ్బంది పెట్టినపాత్రకూడా అదే. కొన్ని పాత్రలు చాలా సజావుగా, నలుగురూ ఊహించినట్టే ముగుస్తాయి. కొన్ని ఎదగవు. ఎదురు తిరుగుతాయి. అలాంటి పాత్ర సత్యభామ.

నలభై సంవత్సరాలక్రితం యిరవైయేళ్ళ సత్యభామని చూసినప్పుడు, సమాధానంలేని ప్రశ్నల్లాగ వాడిగాఉండే ఆ కళ్ళనిచూసినప్పుడు, బారుగా, పిరుదుల్నితాకే జడని చూసినప్పుడు సత్యభామగురించి కథ చెప్పాలనిపించలేదు. సత్యభామ కథచెప్తే వినాలనిపించేది.

ఒకసారి నోరుచేసుకు అడిగితే, నవ్వి "కథలు వ్రాసే వాడివి, నేనుచెప్తే నువ్వేం కథలు వ్రాస్తావ్ ?" అని వెక్కిరించింది.

అదిగో, అప్పుడే సత్యభామనుగురించి కథ వ్రాయా లనుకొన్నాను. ఈ కోరిక ఇప్పటికి నలభై సంవత్సరాల పాతది. కాని ఇంకా తీరనిదను.

పాత్రల స్వరూప స్వభావాలు తెలిస్తే-చివరంటా ముక్కుకి తాడుపోసినట్లు అవే రచయితను లాక్కు-పోతాయి. కాని సత్యభామ విషయంలో ఆమె స్వభావమే ఎదురుతిరిగింది. సత్యభామ ఎప్పుడేం చేస్తుందో తెలీదు. ఆ విశృంఖలత్వం, స్వేచ్ఛా ఆమెకు జీవితంలో వరంగా లభించాయి.

వాళ్ళనాన్న ఇంకా తాసీల్దారీ చేస్తున్న సమయంలో రాజమండ్రిలో వాళ్ళయింట్లో అద్దెకుండేవాడిని.

తాసీల్దారుగారికి పెళ్ళాంలేదు. కాని విదేశీపాలనలో పెరిగిన బారుమీసాలూ, దేశానికి యింకా స్వాతంత్ర్యం రాకముందునుంచే స్వభావానికి లభించిన స్వేచ్ఛా వుంది. ఆ విచ్చలవిడితనాన్ని కూతురికి వారసత్వంగా యిచ్చి పెంచాడు. ఇంట్లో ఎవరో విధవరాలు యిద్దరికీ వండి పడేస్తూండేది.

తాసీల్దారుగారికి కావలసినంత ఆస్తి వుంది. ఈ ధనం, గారాబం, స్వేచ్ఛా మధ్య నిర్లక్ష్యంగా పెరిగిన పిచ్చిపువ్వు సత్యభామ. ఆమెలో అందం భయపట్టేంత క్రూరంగా, మాట మత్తెక్కించేంత మెత్తగా, స్వభావం వానపామంతచంచలంగా వుండేది ఆమె. ఆరోజుల్లో రెండు జడలు వేసేది. రెండు జడలకీ రెండు రేకు సంపెంగి పువ్వులూ, ఆమె యింట్లో ఉన్నంతసేపూ యిల్లంతా పరిమళం గుమగుమలాడిపోయేది.

నాకూ అప్పటికి పెళ్ళికాలేదు – కాని సత్యభామని పెళ్ళి చేసుకోవాలని ఆశించాననడం నా విషయంలో అన్యా

యనే అవుతుంది. ఆ రోజుల్లో యింకా వయస్సులో ఉన్నా నేమో గాని – ఆ జ్ఞానంలో లేను. భోగిమంటను వీధుల్లోనే వేయాలని. ఇంట్లో వేస్తే – ఇంటికే నష్టమని అప్పటికే నాకు తెలుసు.

సత్యభామకూడా పెళ్లిగురించి ఎప్పుడూ ఆలోచించ లేదనుకుంటాను. కాని ఆ రోజుల్లో ఆమెను చూసిన చాలా మంది ఆ ఆలోచనలోపడడం నాకు తెలుసు. అంత స్వేచ్ఛ అలవాటయినవాళ్ళకి పెళ్లి ఒక ఖైదులాగ, పెద్ద శిక్షలాగ కని పిస్తుందనుకుంటాను. అయినా అలాంటి అభిప్రాయం సత్య భామ ఎప్పుడూ ప్రకటించలేదు.

కాని ఒకసారి ఎవరో కుర్రాడు పెళ్ళిగురించో–ప్రేమ గురించో ఆమెపట్ల తొందరపడితే – ఆలశ్యం ఏమీ చెయ్య లేదు సత్యభామ. చెప్పతీసి ఆ కుర్రాడికి బుద్ధి చెప్పింది. ఆ కుర్రాడిని నేను చూశాను. యువతరంలో కనిపించే తొందర పాటు తప్పిస్తే అతనిలో ఏ లోపమూ కనిపించలేదు. సత్య భామకంటె ఒక ఛాయ ఎక్కువగా, బరువుగా, అందంగా, చురుకుగా కనిపించాడు. కాలేజీలో ఆమెతోపాటు, ఆమె కంటె ఇంకాస్త బాగానే చదువుకొంటున్న కుర్రాడు— పెళ్లి చేసుకోనవడానికి ఏమీ కారణం కనిపించలేదు. అయితే ప్రేమకంటె, ప్రేమని వ్యక్తంచేసే తీరు కొందరికి ముఖ్యం. ముఖ్యంగా ఆడవాళ్ళకి– అందుకని ఆశాభంగమే ఆ కుర్రాడికి ఎదురయింది.

ఇటువంటి విచ్చలవిడితనానికి జవాబు పెళ్ళిలో దొరుకుతుందని నేను అనుమానించాను. చాలామంది విశృంఖలత్వానికి ముగింపు వివాహమేనని నా నమ్మకం. అయితే పెళ్లికే సత్యభామ వ్యతిరేకమేమోననుకున్నాను. అదే నిజమయితే. ఆ పాత్రకి అది ప్రత్యేకత అవుతుందనిపించింది.

అరవని కుక్క కరవకపోవడం, విసురుగా పాకే నల్లతాచు పడగెత్తి నాట్యంచేసి పక్కనుంచే తప్పించుకుపోవడం, చెప్పడానికి చాలావిచిత్రమయిన కథలు. తెలిసిన ప్రపంచములో తెలియని స్వభావాలనో, ఊహించని కొత్తదనాన్నో పాత్రలూ, తద్వారా కథలూ, ఆవిష్కరించాలని నా విశ్వాసం. అందమయిన సత్యభామ తన అందంపై లభించిన ప్రశంసని కాదనడం ఒక ప్రత్యేకతగా కనిపించింది.

అదిగో, అప్పుడే సత్యభామని గురించి వ్రాయాలనుకున్నాను.

నా కథలో ఓ రెండు జడల అమ్మాయి వుంటుంది. అల్లరిపిల్ల. ఆ అల్లరి కొంత వాళ్ళనాన్నదీ. డబ్బుదీ,పరిస్థితులదీ అలాంటి అల్లరి అబ్బాయినే కొన్నాళ్ళయాక కలుస్తుంది. ఆమెను ఏడిపించాడని కొడుతుంది. తనని ఏడిపించాలనే ధోరణి తనలో ఎక్కడో ఉందని ఆ తర్వాత గ్రహించి, మారుతుంది ఆ అమ్మాయి. ఇలాగేదో వ్రాయాలని సంకల్పం.

కథ ప్రారంభించబోతూ ఒకసారి మాటల మధ్య సత్యభామతో ఆ మాట అన్నాను–

"నీ గురించి కథ వ్రాస్తున్నాను."

"వెరీ గుడ్ ఏం రాస్తావు?" అంది.

చెప్పాను. కళ్ళు పెద్దవి చేసుకొని అంతా వింది. విని "చివర ఎలా ముగిస్తావు?"

"ఏముంది. ఆ అమ్మాయికి బుద్ధివచ్చి బుద్ధిమంతురాలవుతుంది."-

అంతే పగలబడి నవ్వింది. "ఇదన్నమాట నువ్వు నన్నర్థం చేసుకున్నది. అందుకే మన వాళ్ళ రచనలు ఇంకా మూలబడే వున్నాయి. యూ ఫూల్!- నేనా కుర్రాడిని పెళ్ళిచేసుకోబోతున్నాను, I am in love with him" అంది.

నేను దిగ్భ్రాంతుడినయిపోయాను. నా పాత్రను నేను అర్థంచేసుకోవడంలో ఎక్కడో పొరపాటు జరిగిపోయింది. సజావుగా పోతుందన్న కథ సరిగ్గా కంచికి వెళ్ళలేదు.

అందుకని అప్పట్లో యిక కథ వ్రాయడం ఆపేశాను.

♦ ♦ ♦

ఆ తర్వాత చాలా కథలు వెలువడ్డాయి. కాని నాదగ్గర నలుగురికీ తెలియని ఒక కొత్త పాత్ర యింకా ఖర్చుకాలేదన్న గర్వం చాలారోజులు ఉండిపోయింది. ఆ పాత్ర నాకూ సరిగ్గా అర్థంకానిదని అర్థంకావడానికి మరి పదేళ్ళు పట్టింది.

అప్పటికి తాసీల్దారుగారు చచ్చిపోయారు. విజయ వాడలో సత్యభామ వుంటున్నదని తెలిసి ఒకసారి అటు వచ్చి నప్పుడు వెళ్లాను.

యౌవనంలో తిరుగుబాటుని వయస్సు చల్లార్చి వుంటుందని. ఆమెలోని నిర్లక్ష్యం, పొగరు యివన్నీ తగ్గిన తర్వాత కనిపించేసత్యభామ మరింత అందంగా,ఆకర్షణీయంగా కనిపిస్తుందని ఆశించాను. ఈ సత్యభామ తప్పకుండా పదేళ్ళ క్రిందటే మనస్సులో ప్రారంభమయిన కథకి ముగింపును చెప్తుందనుకున్నాను. ఓ పెద్ద యింటిని కొన్నది తండ్రి పోయాక. అగ్గిపెట్టె నిలబెట్టినట్టు ఆకాశంలోకి ఎదిగిన ఆ యింటిముందు ఆవరణలో కుర్చీ వేసుకు కూర్చునివుంది. అందమయిన బొచ్చుకుక్కలు ఆమెస్తోమతుకు చిహ్నల్లాగ మొక్కల మధ్య తిరుగుతున్నాయి. సత్యభామకి యిప్పుడు వొళ్లొచ్చింది. నడుం దగ్గర, పోచీల దగ్గర ఎర్రటి శరీరం ముడుతలు తిరిగింది. మనిషి మరింత ఠీవిగా నిర్లక్ష్యంగా కనిపించింది. ముప్పైఏళ్ళ వయస్సు ఆ ఠీవయిన విగ్రహంలో యిరవై ఏళ్ళకు కుంచుక పోయింది.

తండ్రి పోయాక - ఏర్పడిన ఒంటరితనం ఆమెను భయ పెట్టినట్టు లేదు. ఆమెను చూసి సంసారిక జీవితంలో ఆమెకు నచ్చిన వ్యక్తిని, చేసుకున్న గర్వమో, ఆమె స్వభావంతో రాజీపడ్డ భర్త దొరికిన తృప్తో ఎదురయిుదనుకున్నాను. పదేళ్ల క్రితం నాకు తెలిసిన కాలేజీ కుర్రాడి ముఖంకోసం విశాల

మయిన ఆ యింటిని వెదికాను— కాని ఎక్కడా అతని జాడ కనిపించలేదు. నా కాశ్చర్యం కలిగించింది. అంతకుమించి— ఆమె స్వభావానికి— ఆ కారణంగా ముప్పైవేళ్ళ యౌవనం వృధా అయినందుకు జాలి కలిగింది.

మామూలుగా "పెళ్ళి కాలేదా? యింకా" అన్నాను.

"ఏం బాబూ! నేనిలా సుఖంగా బ్రతకడం నీకిష్టంలేదా?" అంది.

నేను తెల్లబోయాను. "నీతో చదువుకొన్న కాలేజీ స్టూడెంట్‌ని."

"వాడు బ్రూట్. నన్ను చదువు మానేసి అతనితో హైదరాబాద్ రమ్మంటాడు. వాళ్ళ నాన్నకి అక్కడ పెద్ద ఆస్తి వుందట. గెటవుట్ అన్నాను" అంది.

ఆ పాత్రలో మరేదో మెలకువ అర్థమయినట్టనిపించింది. సత్యభామ స్వభావాన్ని యౌవనం జయించలేకపోయింది. డబ్బు జయించలేకపోయింది.

"అన్నట్టు నా గురించి కథ రాస్తానన్నావుగదూ ఆ రోజులలో?" అంది నన్నుచూసి.

తలూపాను.

"చెప్పు— ఏం వ్రాస్తావు?— మా నాన్న పోయారు. ఆస్తి అంతా నా చేతికి వచ్చింది. చుట్టూ చాలామంది బంధువులున్నారు. వీలు దొరికితే వాళ్ళ కొడుకుల్ని నాకు అంటగట్టాలని చూస్తున్నారు. నేనేం చేస్తానో ఊహించు" అంది.

క్షణం ఆలోచించి తెల్లమొహం వేశాను. ఆమె ప్రశ్న తెనాలి రామకృష్ణుడి కత్తిలాగ కనిపించింది. "పడదంటే మీాద పడవచ్చు. పడుతుందంటే దాటిపోనూ వచ్చు. అయినా ప్రయత్నించి -

"పెళ్ళి మానేస్తావా?" అన్నాను.

"డామ్‌ఫూల్! అందుకే మీా కథకులు యింకా వెనకనే వున్నారు. మన యింటిపక్కనే ఉండేవాడే కాలేజీలో Demonstrator అతన్ని పెళ్ళి చేసుకోదలుచుకున్నాను" అంది. నివ్వెరపోయాను.

సన్నగా పీలగా ఉండే ఒకాయన- మా ఇంటిముందు నుంచి సైకిలుమీాద వెళ్తూండే సందర్భాలు గుర్తుకొచ్చాయి. అతనిలో గుర్తుంచుకోదగ్గ ప్రత్యేకతలేమీా లేవు. ఒకటి రెండు సార్లు సిగరెట్లు కాల్చుకునేందుకు అగ్గిపెట్టెకోసం నా దగ్గర ఆగిన గుర్తుంది. అప్పుడు చెప్పాడు అతని ఉద్యోగం. వదులు పాంటూ, విశాలమయిన నుదురు, పాలిపోయినట్టుండే శరీరపు ఛాయ, గుర్తుకొచ్చి సత్యభామను చూసి జాలిపడాలో, ప్రశంసించాలో అర్థంకాలేదు.

"ఏమిటి అతనిలో నిన్నాకర్షించిన గొప్పతనం" అన్నాను. నవ్వింది సత్యభామ.

"ఆలోచించు. అది అర్థంచేసుకున్నాక కథ పూర్తి చెయ్" అంది.

ఆలోచించలేకపోయాను. ఆ సమస్యని విప్పడం బ్రహ్మ ప్రళయంలాగ కనిపించి కథ రాయడానికికూడా ఆ తర్వాత సాహసించలేకపోయాను.

సత్యభామ మంచి పాత్రని తెలుసు. మంచి ముగింపు రానిదీ— ఆ పాత్ర వృధా అవుతుందనీ తెలుసు. అందుకని మరో పది పదిహేనేళ్లు ఆ కథ ముందుకు కదలలేదు.

♦ ♦ ♦

తర్వాత పది పన్నెండేళ్ళ ప్రవాసాంధ్రుడిగా చక్రధరపూర్‌లో ఉన్నాను. దూరమయిన దేశీయ వాతావరణంలోంచి పాత్రలు ఏరుకోవడం ఎంత యిబ్బందో అన్ని సంవత్సరాలు నాకు తెలిసి వస్తూనే వుంది. ఆ సందర్భాలలో చాలాసార్లు నన్ను చాలా అల్లరిపెట్టిన సత్యభామ పాత్ర గుర్తుకొస్తూనే వుంది. ఈలోగా జీవితం ఆ పాత్రకి మరికొన్ని కొలతల్ని ఏర్పరచింది. రంగు మార్చింది. మరొక్కసారి ఆమెను చూడగలిగితే కథకి ముగింపు తెలుస్తుందనుకున్నాను.

ఈలోగా సత్యభామ తను చెప్పినట్టే College demonstrator ని చేసుకొన్న శుభలేఖ చూశాను. తర్వాత ఆ రేడు సంవత్సరాలతో ముగ్గురు పిల్లలు పుట్టారనికూడా విన్నాను. సంసారిక జీవితంలో సౌఖ్యానికి పిల్లలు పెట్టని గురుతలు. సత్యభామని ఇన్నాళ్ళకి జీవితం ఓడించిందను

కున్నాను. అటువంటి వ్యక్తి సుఖాన్ని గురించి ఆలోచించడం, యీ ప్రపంచంలో అసలు అందం ఆనందం అంటూ ఉన్నదని గుర్తించడం ఒక రకంగా వాళ్ళ స్వభావానికి ఓటమేననీ నా అభిప్రాయం.

పిల్లల్నీ, సత్యభామనీ చూడాలని పదేపదే అనిపించినా మరి పదిహేనేళ్ళు పడలేదు. అప్పటికి చిత్తూరులో ఉంది ఆ కుటుంబం. సత్యభామ విజయవాడలో కొన్నయిల్లు అమ్మేసింది. పిల్లలతో, భర్తతో అక్కడికి వెళ్ళిపోయింది.

ఈ మార్పంతా భర్త ప్రోద్బలంవల్లనో, భర్తపట్లగల ప్రేమవల్లనో వచ్చిన మార్పే అయితే, నా పాత్రకి మంచి ముగింపు వస్తోందని సంతోషించాను.

ఈసారి తీరికగా చిత్తూరు వచ్చాను సత్యభామని వెదుక్కొంటూ.

పిల్లలు తిరిగి పెద్దవాళ్ళయారు. సత్యభామకూడా పెద్దదయింది. ఆ పెద్దరికం ఆమె శరీరంలో, గడ్డందగ్గర ఏర్పడిన ముడతలో ఎక్కువగా అర్థమయింది. కాని ఆశ్చర్యమేమిటంటే ఆమె స్వభావంలో ఏకోశానా రాజీ కనిపించలేదు. ఇంటిలో నౌకర్లు ఎక్కువయారు. ఈ శరీరానికీ, ఈ స్వభావానికీ, ఈ ఐశ్వర్యానికీ యిప్పుడెంతో పొందిక కనిపించింది. సత్యభామ ఈ నిర్లక్ష్యపు స్వభావంతో యౌవనంలోకంటె యీ వయస్సులో అతికినట్టు కనిపించింది. సరిగ్గా యిదే ఆమెకు తగిన స్థితిలాగ గోచరించింది. ఆమె జీవితంలో ఏదయితే కావాలనుకున్నదో ఆ స్థితి పరాకాష్ఠ యిప్పటిదే ననిపించింది. సత్యభామ

పుట్టుకనుంచీ మధ్యవయస్సులో నేవుంది. అయితే నేను గుర్తించడానికి యింతకాలం పట్టింది.

తల తిప్పకుండా నౌకర్లకి ఆదేశాలివ్వడం, అరమోడ్పు కన్నులతో ఆడుకొంటున్న పిల్లల్ని గమనిస్తూండడం, ఏ విషయానికీ ఎక్కువ లోతుకుపోయి ఆలోచించకపోవడం, ఇవన్నీ విస్తుపోయి ఆలోచిస్తూ కూర్చున్నాను.

అంతకుమించి ఆ రివటలాంటి కాలేజీ డిమాన్‌స్ట్రేటర్‌ని చూడాలని తెగ కుతూహలపడ్డాను.

పిల్లలంతా సన్నగా రివటల్లాగే వున్నారు. వాళ్ళందరిలోనూ పరోక్షంగా కాలేజీ డిమాన్‌స్ట్రేటర్ కనిపిస్తున్నాడు. ఈ వివాహం అతన్నెలా మార్చిందో చూడాలని ఆసక్తి ఎక్కువయింది.

నా కళ్ళ వెదుకులాటని పసిగట్టినట్టుంది.

"ఏమిటి వెదుకుతున్నావు ?" అంది.

"ఈ ఎగ్జిబిషన్‌లో యిప్పుడు ఎక్కడ వున్న వస్తువులు అక్కడ ఉన్నట్టనిపిస్తోంది. కాని ఒక్కటే లోపం."

"ఏమిటది ?"

"ఒక వస్తువు కనిపించడంలేదు."

"చెప్పు"

"నీ భర్త"

"ఓస్! అదా!" అంది విరిగిపోయిన కుంటి బొమ్మని గురించి మాట్లాడుతున్నంత నిర్లక్ష్యంతో.

"ఆయన యిక్కడ ఉండరు" అంది చివరికి. ఆముఖంలో ఏవో భావాన్ని గుర్తించబోయి నేనే విఫలుణ్ణయాను.

"ఏం? ఆయనకి మరో ఇల్లు కొన్నావా?" అన్నాను.

"ఒకటికాదు. నాతో వుంటే పది కొనేదాన్ని. అసలు డబ్బు అతని మనసును పాడుచేసింది" అంది.

"అంటే నీ డబ్బుకు వ్యామోహపడి నిన్ను చేసుకొన్నాడంటావా?"

"ఊహుం అదేంకాదు. నా డబ్బయినా అతనికి వ్యామోహాన్ని కలిగించలేకపోయిందని నాబాధ. నన్ను చేసుకున్నాక ఆయన్ని ఉద్యోగం మానిపించేశాను. ఇద్దరం చాలాహాయిగా గడిపాం చాలా సంవత్సరాలపాటు. తర్వాత– తర్వాత హఠాత్తుగా వాళ్ళ బాబాయెవరో పోయాడు."

సత్యభామ చెప్పిన హాయికి అర్థం ఏమిటా అని ఆలోచిస్తున్నాను. తనకు ఎదురుచెప్పని సహనం. తన స్వభావంతో రాజీకి, వీటికి సత్యభామ "హాయి"అని గుర్తుపెట్టుకుందేమో.

"వాళ్ళ బాబాయి చచ్చిపోతే ఏం ?" అన్నాను.

"అతనికి పదివేలు ఆస్తి కలిసొచ్చింది. చచ్చు పది వేలు. నా దగ్గర దానికి పదిరెట్లు వుంది.

వాళ్ళ బాబాయి ఆస్తులేవో కంచిలో వున్నాయి. అక్కడికి వెళ్ళి కూచున్నాడు. ఆస్తి చూడగానే అతనికి మతిపోయి

స్తుంది. అక్కడికి నన్ను రమ్మంటాడు పిల్లల్ని తీసుకుని. అక్కడే ఉండాలంటాడు. ఆ వూరే బాగుందట" ఆగింది కాస్సేపు. వయస్సును సూచించడానికి మాటలమధ్య అర్ధాంతరంగా ఆగి, నాజూకుగా ఊపిరి పీల్చుకోవడాన్ని అలవాటు చేసుకొంది.

"పోనీ వెళ్ళలేకపోయావు" అన్నాను.

"నాన్సెన్స్- ఎలాగయితేనేం- చచ్చు ఆస్తి కలిసొచ్చిందని నన్ను కదిలిపొమ్మంటావా? నేను వెళ్ళనుగాక వెళ్ళను" అంది.

"ఇది జరిగి ఎన్నాళ్ళయింది ?"

"ఆరేళ్ళు"

మరింకేమీ అడగలేదు. నాకు వాళ్ళ సమస్య అర్థమైపోయింది. భర్తకి ఆమె స్వభావాన్ని ఎదుర్కొనే మెలకువ నేర్చుకోలేదు. ఎదుర్కొనంతవరకూ గడచిన సంవత్సరాలకి ఆమె "హాయి" గుర్తుపెట్టుకుంది. తనలోని అహంకారాన్ని ఎదుటి వ్యక్తిలో చూడడం సత్యభామకు నచ్చదు. డబ్బు చేతికి వచ్చాక భర్త చూపకుండా ఉండలేకపోయాడు. సత్యభామకి తల తిరిగింది. తన స్వభావానికి, తను నమ్మిన ఈ హోదాకి రాజీనామా యివ్వడంకంటె భర్తని దూరంచేసుకుంది. ఇంకా ఇప్పటికీ తను గడిపిన 'హాయి' గుర్తు రోజులకంటె, "హోదా మార్కు బ్రతుకుమీద వ్యామోహం ఆమెకు మిగిలిపోయింది."

ఒక 'రాజీ'గా కుదుర్చుకున్న భర్త యిన్నాళ్ళకు ఎదురుతిరిగాడు.

పిల్లలుకూడా 'హాయి' మార్పు బ్రతుక్కి సిద్ధపడు తున్నారా అని ఆత్రుతగా చూశాను. కాని వాళ్ళ స్వభా వాల్లో సత్యభామకంటె కాలేజీ డిమాన్‌స్ట్రేటర్ ఎక్కువ కని పించాడు. కాస్త స్థిమితపడ్డాను.

"ఇప్పుడేం చేస్తావు? ఇలా ఎంతకాలం ఉంటావు?" అన్నాను సత్యభామతో వెళ్ళేముందు.

"అది ఆయన నిర్ణయించుకోవలసిన విషయం, నాకేం?" అంది యథాలాపంగా.

"ఎప్పుడైనా కంచివెళ్తే ఉత్తరం వ్రాయి." అని వచ్చే శాను.

"ఎప్పుడయినా ఆయన తిరిగివస్తే వ్రాస్తాను" అంది నవ్వుతూ.

ఇది జరిగి చాలా సంవత్సరాలు అయిపోయింది.

అపురూపంగా మనస్సులో 40 సంవత్సరాలు పోషిం చిన పాత్రకి-సత్యభామకి ఏదయినా ముగింపు చెప్తుందేమో నని చాలా సంవత్సరాలు ఎదురుచూశాను.

కాని లాభంలేదు.

సత్యభామ కంచికి వెళ్ళలేదు. వెళ్తే ఏంజరుగుతుందో నేను ఊహించలేని విషయం. ముఖ్యంగా సత్యభామ విషయంలో.

సత్యభామ జీవితం ఒక ముగింపులేని నిరంతర ప్రోత్సాహం. తనగర్వం తనకే తెలియకుండా నిశ్చలంగా కదిలిపోయే నది ఆమె చరిత్ర. ముగింపులేనిపాత్ర సత్యభామ.

అందుకని- సత్యభామ కంచికి వెళ్ళడం నా కిష్టమే అయినా, కంచికి వెళ్ళని కథగానే దీన్ని వదిలేయక తప్పలేదు.

—ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక, జూలై, 1969.

—:o:—